క్లుప్తంగా

వసుధకు డాక్టరేట్



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ మైక్రోబయాలజీ విభాగం పరిశోధకురాలు ఎం.వసుధకు యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. జెనిటిక్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆఫ్ టోమాటో విత్ ఏటీఎన్‌పీఆర్‌ఐ జీన్ టూ కన్ఫర్ రెడ్‌స్టెంత్ టూ ఫంగల్ డీసీజెస్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి వసుధకు డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్.నర్సింహాచారి తెలిపారు. ఆ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.వెంకటయ్య పర్యవేక్షణలో వసుధ తన పీహెచ్‌డీ పూర్తి చేసింది.

రాజ్‌కుమార్‌కు సన్మానం



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని హిస్టరీ అండ్ మాస్టర్ ఆఫ్ టూరిజం విభాగం ఇన్‌చార్జ్ అధిపతిగా బాధ్యతలు స్వీకరించిన కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చిలువేరు రాజ్‌కుమార్‌ను కేయూ అధ్యాపకుల సంఘం సన్మానించింది. శాలువా కప్పి మొక్కను అందజేశారు. కార్యక్రమంలో కేయూ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోథ్, ఉపాధ్యక్షుడు డాక్టర్ టి నాగయ్య, బాధ్యులు గడ్డం కృష్ణ,మధుకర్ రావు, మధుశ్రీ, బ్రహ్మయ్య, కుమార్,బి శ్రీధర్ వెంకన్న, సత్యనారాయణ పాల్గొన్నారు.

రేపు రథోత్సవం



వరంగల్ చౌరస్తా : భద్రకాళీ, భద్రేశ్వరుల కల్యాణ మహోత్సవంలో భాగంగా ఈనెల 16న పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో రథోత్సవం, కంకుమార్చన, మహాన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు, నగర మాజీ మేయర్ గుండా ప్రకాశ్‌రావు తెలిపారు. మంగళవారం వరంగల్ ఆర్‌ఎన్‌టీ రోడ్డులోని పట్టణ ఆర్యవైశ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కరపత్రాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. సమావేశంలో కార్యక్రమ కన్వీనర్లు తోను పునూరి వీరన్న, మల్యాల వీర మల్లయ్య, గోపీనాథ్,తదితరులు పాల్గొన్నారు.

లాఠీచార్జి సరికాదు

విద్యారణ్యపురి: నారాయణఖేడ్ అసెంబ్లీ సెగ్మెంట్ ప్రాంతంలో ఎన్నికల విధులు నిర్వహించిన ఉపాధ్యాయులు తమకు రావాల్సిన భత్యాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసినట్లుగానే తమకు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగిన ఉపాధ్యాయులను పోలీస్‌లచే లాఠీచార్జి చేయించడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వర్లు, పూజారి మనోజ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ గొడవకు కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 15న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్ ఏరియాలోని ఆన్సార్ కాలనీలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కాజీపేట మెయిన్ రోడ్డు, విష్ణుపురి కాలనీ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో చోరీ

హసన్‌పర్తి : కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి రెండు వేర్వేరు ప్రాంతాల్లో చోరీ జరిగింది. ఈ సంఘటనలో రూ.14 లక్షల విలువైన సామగ్రి, పొగాకు ప్రొడక్ట్స్ చోరీకి గురయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని యూనివర్సిటీ-2 గేట్ సమీపంలో పల్లూరి హరీష్ అనే వ్యక్తి వంశీ ఏజెన్సీ నిర్వహిస్తున్నాడు. ఈ ఏజెన్సీ ద్వారా పొగాకు ప్రొడక్ట్స్ అమ్మకాలు చేపడుతున్నాడు. అయితే సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు తాళాలు ధ్వంసం చేసి సుమారు రూ.12 లక్షల విలువైన పొగాకు ప్రొడక్ట్ చోరీ చేశారు.బాధితుడు కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశాడు.

మరో ప్రాంతంలో...

గోపాలపురంలోని భద్రకాళినగర్‌లో ఓ ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ జరిగింది. కాలనీకి చెందిన రవి నాయక్ దంపతులు ప్రభుత్వ ఉపాధ్యాయులు. దంపతులిద్దరూ సోమవారం లోక్‌సభ ఎన్నిక విధులు నిర్వహించి తిరిగి ఇంటికి వచ్చారు. ఇంట్లో సుమారు రూ.2లక్షల విలువైన సామగ్రిని కనిపించలేదు. బాధితులు మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పెచ్చుమీరుతున్న తూకం మోసాలు

కాజీపేట పట్టణంలోని విష్ణుపురి ప్రాంతానికి చెందిన గౌని సాంబయ్య అనే రెల్వే రిటైర్డ్ ఉద్యోగి తన ఇంటికి బంధువులు రావడంతో చేపలు కొనుగోలు చేయడం కోసం ప్రధాన రహదారిపై ఉన్న మార్కెట్‌కు వచ్చారు. కిలోకు రూ.125లు చొప్పున చెల్లించి 2 కిలోల చేపలు కొనుగోలు చేసి బయటకు వచ్చి తూకంగా వేయించగా కిలోన్నర మాత్రమే ఉన్నాయి.

కాజీపేట సోమిడి గ్రామానికి చెందిన పెసరు రాజు ఓ మటన్ దుకాణంలోకి వెళ్లి రూ.840లు ఇచ్చి కిలో మాంసం కొనుగోలు చేశాడు. ఎందుకో మాంసం తక్కువగా ఉందనే అనుమానం రావడంతో పక్కనే ఉన్న తెలిసిన షాపులో తూకం వేయించగా 900గ్రాములే వచ్చింది.

పైన పేర్కొన్న సమస్య వారిద్దరికి సంబంధించిన కాదు. కాజీపేట పట్టణంలో ప్రతీ కొనుగోలుదారుడికి ఎదురవుతున్న సమస్య. కూరగాయలు మొదలుకుని మాంసం, చేపలు, చికెన్ తదితర వస్తువుల అమ్మకాల్లో వ్యాపారులు తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నారు.

\- కాజీపేట



రహదారిపై చేపలు అమ్ముతున్న వ్యాపారులు



తూకం రాళ్లతో కూరగాయలు విక్రయిస్తున్న మహిళ



చేపను కాంటా వేస్తున్న వ్యాపారి

తూనికల్లో వ్యత్యాసాలతో మోసపోతున్న వినియోగదారులు

- కంప్యూటరైజ్డ్ కాంటాతోనూ దగా
- పట్టించుకోని అధికారులు

బజారులో పలు దుకాణాల్లో తూనికల మోసాలు పెరుగుతూనే ఉన్నాయి. నాణ్యమైన సరకులు సరసమైన ధరలకు అందిస్తామంటూ వ్యాపారులు మోసానికి పాల్పడుతున్నారు. కచ్చితమైన ధర చెల్లించినా తూనికల్లో మోసాల కారణంగా కొనుగోలుదారుల జేబుకు చిల్లు పడుతోంది. సంబంధిత అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టని కారణంగా అనేక మంది వ్యాపారులు నేటికీ చేతి కాంటాలనే వినియోగిస్తూ తూకంలో రాళ్లను వినియోగిస్తుండడం చర్చనీయంశంగా మారింది.

కంప్యూటరైజ్డ్ కాంటాల్లోనూ మోసం

నేడు అక్కడక్కడ వినియోగిస్తున్న కంప్యూటరైజ్డ్ డిజిటల్ కాంటాలు అందుబాటులో ఉన్నా వాటితోనూ వ్యాపారులు మోసాలకు పాల్పడుతున్నారనే అనుమానం కొనుగోలుదారులను వేధిస్తోంది. ప్రస్తుతం బజారుల్లో ఉన్న కాంటాల్లో వస్తువులను తూసే సమయంలో మోసం జరుగుతోంది. కంప్యూటరైజ్డ్ కాంటాల్లో మోసం జరుగుతుందని ఎవరూ ఊహించరు. నిజానికి సాధారణ కాంటాలతో పోలిస్తే ఈ కాంటాల్లో జరిగే మోసాలే అధికంగా కనిపిస్తున్నాయి. ఎందుకంటే ఈ కాంటాల్లో గత మెమోరీ చిప్‌ను వ్యాపారులు ముందుగానే సవరించి పెడుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వ్యాపారులు సర్దుబాటు చేసిన విధంగా ఒకసారిగా కాంటా ముందుకు వెళ్తుంది. అంటే వ్యాపారులు అమ్మే వస్తువులకు అనుగుణంగా ఎన్ని గ్రాములు లేదా కిలోలు కోత విధించాలో అంతమేర మెమోరీ చిప్‌ను సవరించి ఉంచడం వలన కొనుగోలుదారులకు ఎలాంటి అనుమానం కలుగదు. ఈ తరహా మోసాలు కాజీపేట పట్టణంలో చాలామంది వ్యాపారులు బజారుల్లో పాల్పడుతున్నారు.

పట్టించుకోని అధికారులు

జిల్లాలోని తూనికలు, కొలతలు శాఖ అధికారులు మాత్రం కాంటాలకు సీల్ ఉందా లేదా అని పరిశీలించి వాటి సీళ్లకు కాలపరిమితి దాటితే అపరాధ రుసుం వేసి వెళ్లిపోతారు. అయితే కాంటాలో ఏమేర మోసాలు చేస్తున్నారనే విషయం పరిశీలించకపోవడంతో చాలా మంది వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వ్యాపారుల చేతివాటం సంబంధిత అధికారులకు తెలిసినప్పటికీ పెద్దగా పట్టించుకోకపోవడం చర్చనీయంశంగా మారింది. ప్రతిఏటా వ్యాపారులు కలిసికట్టుగా ఇచ్చే మామూలేనని విమర్శిస్తున్నారు. దీనిపై తూనికలు కొలతల శాఖ అధికారులు దృష్టి సారించి ఎప్పటికప్పుడు దాడులు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

శ్వేతార్కుడిని దర్శించుకున్న 'సిరిసిల్ల'



పూజలో పాల్గొన్న సిరిసిల్ల రాజయ్య

కాజీపేట: పట్టణంలో కొలువుదీరిన స్వయంభూ శ్రీశ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రాన్ని మంగళవారం రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఒకే ప్రాంగణంలో 29 దేవతామూర్తులను ప్రతిష్ఠించి నిత్యం విశేష పూజలు చేస్తున్న అర్చకులు, పండితులను అభినందించారు. ఆలయ విశిష్టత, పూజలు, ఉత్సవాల వివరాలను ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు వివరించడంతో పాటు స్వామివారి శేషవస్త్రాలతో సన్మానించి చిత్రపటం అందజేశారు. శ్వేతార్కుడి పుట్టినరోజును పురస్కరించుకుని ట్రైసిటీలో భక్తులకు మహాన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, మాజీ కార్పొరేటర్ రమ, రంగనాథ్, రాధాకృష్ణ శర్మ, రవి తదితరులు పాల్గొన్నారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో 'సెయింట్ పీటర్స్' విజయభేరి



సరయు



లీనస్



అబ్దుల్లా జైద్



నిషాంత్



విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్లు

కాజీపేట అర్బన్ : సీబీఎస్ఈ 10, 12వ తరగతి ఫలితాల్లో సెయింట్ పీటర్స్ విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించి విజయభేరి మోగించారని విద్యాసంస్థల డైరెక్టర్లు డాక్టర్ గోపు మత్యాస్‌రెడ్డి, సునీతారెడ్డి తెలిపారు. విద్యాసంస్థల ఆవరణలో మంగళవారం అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించి డైరెక్టర్లు మాట్లాడారు. 12వ తరగతి ఎంపీసీలో నిషాంత్ 96 శాతం, సాకేత్ రావు 83 శాతం, సాయి తులసిరాం 76 శాతం, సాయివర్ధన్ 73 శాతం, పూజిత 72 శాతం, బీపీసీలో ఆఫియా, సంహిత 83 శాతం, సుహా, బుపా 75 శాతం మార్కులు సాధించారని తెలిపారు. అదే విధంగా 10వ తరగతిలో కే.సరయూ 96.5 శాతం, లీనస్ 96 శాతం, అబ్దుల్లా జైద్ 96 శాతం మార్కులు సాధించారన్నారు. 20 మంది విద్యార్థులు 90 శాతం పైగా, 53 మంది 85 శాతం పైగా, 77 మంది విద్యార్థులు 75 శాతం పైగా మిగతా 65 శాతం పైగా మార్కులు సాధించారని తెలిపారు.

19న విశ్వబ్రాహ్మణులు పాల్గొనాలి



ఆహ్వానపత్రికను ఆవిష్కరిస్తున్న సంఘం సభ్యులు

హన్మకొండ కల్చరల్ : శ్రీభద్రకాళి దేవాలయంలో నిర్వహిస్తున్న శ్రీభద్రకాళి భద్రేశ్వరస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 19న అమ్మవారికి జరిగే పూజల్లో విశ్వబ్రాహ్మణులందరూ పాల్గొనాలని రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచార్యులు కోరారు. మంగళవారం హనుమకొండ చౌరస్తాలోని ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఉత్సవాల ఆహ్వానపత్రికను ఆవిష్కరించారు. అనంతరం కృష్ణమాచారి మాట్లాడుతూ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం, వరంగల్ ఉమ్మడి జిల్లా విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర సంఘం ఉపాధ్యక్షులు వీణవంక సదానందం, సలహాదారులు గజ్జెల వీరన్న, పాడిచెట్టి విష్ణువర్ధన్, రామోజు నాగరాజు పాల్గొన్నారు.

ఎస్‌ఆర్‌ఆర్ తోటకు చేరిన మృతదేహాలు

- మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ఖిలా వరంగల్ : హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై జనగామ జిల్లా రఘునాథపల్లి మొబైల్ టిఫిన్ సెంటర్ వద్ద అల్పాహారం తింటున్న వారిపై ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దుర్మరణం చెందిన విషయం విధితమే.. నగరంలోని ఎస్‌ఆర్‌ఆర్‌తోటకు చెందిన తెలకలపల్లి రవీందర్ కుటుంబం బతుకుదెరువు నిమిత్తం హైదరాబాద్ బీబీనగర్‌లో ఉంటుంది. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఓటు వేసేందుకు బీబీనగర్ నుంచి సోమవారం ఉదయాన్నే సొంతూరికి బైక్‌పై బయల్దేరారు. దారి మధ్యలో రఘునాథపల్లి సమీపంలోని రోడ్డు పక్కన్న మొబైల్ టిఫిన్ సెంటర్ వద్ద అల్పాహారం తింటుండగా ఆర్టీసీ బస్సు అదుపు తప్పి ఢీకొట్టిన ఘటనలో భార్యభర్తలు, కుమారుడు దుర్మరణం చెందారు. మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి చేసుకుని ఎస్‌ఆర్‌ఆర్ తోటలోని స్వగృహానికి మృతదేహాలు చేరుకోగా.. ఒక్కసారిగా విషాదఛాయలు అలుముకున్నాయి. స్థానిక కార్పొరేటర్ పల్లం పద్మ, బీఆర్‌ఎస్ నేత పల్లం రవిలతో కలిసి మాజీ ఎమ్మెల్యే నరేందర్ మంగళవారం మధ్యాహ్నం మృతదేహాలను సందర్శించారు. అనంతరం పార్థివదేహాలపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుల కుటుంబానికి అండగా ఉంటామని నరేందర్ హామీ ఇచ్చారు.

వరదనీరు సాఫీగా వెళ్తేనే బిల్లులు మంజూరు



వరంగల్ చౌరస్తా : వరంగల్ ఆర్టీసీ తాత్కాలిక బస్‌స్టేషన్‌లో వర్షం నీరు సాఫీగా వెళ్తేనే బిల్లులు మంజూరు చేస్తామని 'కుడా'ఈఈ భీంరావు ఆదేశించారు. మంగళవారం వరంగల్ ఆర్టీసీ తాత్కాలిక బస్‌స్టేషన్ ఆవరణలో కురిసిన వర్షం నీరు, మురుగునీరు నిల్వలను ఆర్టీసీ అధికారులతో కలిసి పరిశీలించారు. వరద నీరు పోయేందుకు అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మించి, జాలీలను ఏర్పాటు చేసి, నీరు సవ్యంగా పోయేందుకు చర్యలు చేపట్టాలని ఈఈ కాంట్రాక్టర్‌కు సూచించారు. ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని సూచనలు చేశారు.

సెల్వరాజ్ మృతి కార్మిక ఉద్యమాలకు లోటు

న్యూశాయంపేట : తమిళనాడులోని నాగపట్టిణం పార్లమెంట్ సభ్యుడు సెల్వరాజ్ మృతి కార్మిక, కర్షక ఉద్యమాలకు తీరనిలోటని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు టి.వెంకట్రాములు అన్నారు. నాలుగుసార్లు ఎంపీగా ఎన్నికై పార్లమెంట్‌లో రైతు, కూలీల అన్ని వర్గాల ప్రజల వాణిని వినిపించిన నిస్వార్థ ప్రజానాయకుడన్నారు. ఆయన మృతి పట్ల తన ప్రగాఢ సంతాపాన్ని ప్రకటిస్తున్నట్లు మంగళవారం తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

కాజీపేట రూరల్ : కాజీపేట రైల్వేస్టేషన్‌లో ప్రయాణిస్తున్న రైల్లో నుంచి జారిపడి తీవ్రగాయాల పాలైన గుర్తుతెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు జీఆర్పీ పోలీసులు తెలిపారు. కాజీపేట జీఆర్‌పీ ఎస్సై మోహినుద్దీన్ మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం. ఈ నెల 4న సుమారు 45 ఏళ్ల వ్యక్తి రైల్లో నుంచి జారిపడ్డాడు. దీంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ధిక్కార స్వరం.. ప్రొఫెసర్ బుర్ర రాములు



బుర్ర రాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జీవన్, పీడీఎస్‌యూ నాయకులు

కేయూ క్యాంపస్: ఎక్కడ అణచివేత ఉంటుందో, ఎక్కడ ప్రజల హక్కులు హరించుతాయో అక్కడ ప్రొఫెసర్ బుర్ర రాములు ఎదురు నిలబడి తన ధిక్కార స్వరం వినిపించేవారని ప్రజల హక్కుల గొంతుకగా అండగా నిలబడేవారని వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తీగల జీవన్ అన్నారు. మంగళవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో కేయూ గేట్‌వద్ద దివంగత ప్రొఫెసర్ బుర్ర రాములు వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా రాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జీవన్ మాట్లాడుతూ ఆనాడు రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ అణిచివేతకు గురవుతున్న ప్రజల పక్షాన నిలబడి అణగారిన హక్కులకోసం రాములు పోరాడారని కొనియాడారు. బుర్రరాములును స్ఫూర్తిగా తీసుకొని సమాజంలోని అసమానతలపై, వివక్షతను ప్రశ్నిస్తూ పోరాటం చేయాలన్నారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకటరెడ్డి మాట్లాడుతూ విద్యారంగంలో ఉన్న సమస్యలపై పోరాడుతూ శాస్త్రీయ విద్యావిధానం కోసం పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో బుర్రరాములు కుమార్తె సృజన, పీడీఎస్‌యూ నాయకులు సూత్రపు అనిల్, రంజిత్, శ్రావణ్, గణేష్, మహేష్, అర్జున్, వంశీ, రవి, సురేష్, డింపు,తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సమైక్యతా శిబిరానికి ఎల్‌బీ విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకుడు

రామన్నపేట : హైదరాబాద్‌లో నిర్వహించే జాతీయ సమైక్యతా శిబిరానికి నగరంలోని లాల్‌బహదూర్ కళాశాల ఎన్‌సీసీ ఆర్మీ పదో బెటాలియన్ విద్యార్థులు 17 మంది ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్‌రావు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు మంగళవారం శిబిరంలో పాల్గొనేందుకు హైదరాబాద్‌కు బయలుదేరినట్లు తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి ఎన్‌సీసీ కేడెట్స్, ఎయిర్ ఫోర్స్, నేవీ పాల్గొనే ఈ శిబిరంలో కళాశాల విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు. శిబిరానికి ఎంపికైన విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో కెప్టెన్ ఎం.సదానందం, సీనియర్ అండర్ ఆఫీసర్ రాజ్‌కుమార్, జూనియర్ అండర్ ఆఫీసర్ సంతోషి, ఎన్‌సీసీ కేడెట్స్ పాల్గొన్నారు.

ఎన్నికల్లో 'ఇండియా కూటమిదే' విజయం



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

న్యూశాయంపేట : వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో వామపక్షాల మద్దతుతో పోటీచేసిన ఇండియా కూటమి అభ్యర్థులు భారీ మెజారిటీతో విజయం సాధించబోతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు టి.శ్రీనివాస్ రావు అన్నారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఎన్నికలు ప్రజాస్వామ్యవాదులకు, మతోన్మాదులకు మధ్య జరిగిన ఎన్నికలు అన్నారు. మతం, కులం పేరుతో ప్రజలను రెచ్చగొట్టి ఓట్లు దండుకోవాలని చూసేవారికి ఈ ఎన్నికలు ఒక గుణపాఠం అని అన్నారు. సమావేశంలో నాయకులు కర్రె భిక్షపతి, కరుణాకర్, ఆదిరి శ్రీనివాస్, సదాలక్ష్మి, ఎల్లేశ్, వేల్పుల సారంగపాణి, ఏ.శ్రీనివాస్, సంతోష్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వ్యక్తులపై ఫిర్యాదు



ఎస్సై గోవర్ధన్‌కి ఫిర్యాదు చేస్తున్న వేణుగోపాల్

ఖిలా వరంగల్ : అర్ధరాత్రి పోలీస్, ప్రెస్ అంటూ బెదిరింపులకు పాల్పడిన వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బాధితుడు కమటం వేణుగోపాల్ కోరారు. అర్ధరాత్రి రహదారిపై కారు పార్క్ చేసి బెదిరింపులకు పాల్పడిన వ్యక్తులపై వేణుగోపాల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడు తెలిపిన కథనం ప్రకారం.. సోమవారం అర్ధరాత్రి ఒంటి గంటకు సాకరాశికుంట మహా రాజుల కాలనీలో పోలీస్ సైరన్ వేస్తూ అనుమానా స్పదంగా ఉన్న ఒక ప్రైవేటు వాహనం (టీఎస్03ఈక్యూ3816) నంబర్ గల కారు కనిపించింది. రహదారిపై చేస్తున్న హల్‌చల్‌ను సెల్‌ఫోన్‌లో చిత్రకరించే ప్రయత్నం చేస్తుండగా ఆ వాహనంలో ఉన్న నలుగురు ఒకరు పోలీస్ డిపార్ట్‌మెంట్ అని, మరొకరు ప్రెస్ అంటూ నాపై దాడికి దిగి సెల్ ఫోన్ లాక్కున్నారని తెలిపాడు. జర్నలిస్టు ఐడీ కార్డు చూపాలని నాపై దౌర్జన్యానికి దిగారు. దుర్భాషలాడుతూ నీ ఇల్లు ఎక్కుడా.. నీ అంతుచూస్తామని బెదిరించారు. స్థానికులు రోడ్డుపైకి రావడంతో సెల్‌ఫోన్ విసిరేసి కారులో పారిపోయారు. వారు వాడే కారుపై కార్పొరేటర్ అని లేబుల్ స్టిక్కర్ ఉందన్నారు. రాత్రి నాపై దాడికి పాల్పడిన నలుగురిపై కేసు నమోదు చేసి తనకు న్యాయం చేయాలని మంగళవారం మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

ఓటర్ల డబ్బులు పంచుకున్నారు!

- గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య గొడవ
- విషయం బయటికి రాకుండా జాగ్రత్తలు
- గ్రామాల్లో క్రాస్ ఓటింగ్

హసన్‌పర్తి: ఓటర్లను మభ్యపెట్టడానికి పార్టీ అభ్యర్థులు ఇచ్చిన డబ్బులను పార్టీ సీనియర్లు కొన్ని గ్రామాల్లో ఓటర్లకు పంచకుండా పంచుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఈ విషయమై ఆయా గ్రామాల్లో సీనియర్లు, కార్యకర్తల మధ్య గొడవ జరిగినట్లు తెలిసింది. ఈ విషయమై కార్యకర్తలు ఆయా గ్రామాల్లోని పార్టీ అధ్యక్షులను నిలదీసినట్లు సమాచారం. ఈ విషయం బయటికీ పొక్కకుండా పార్టీ శ్రేణులు జాగ్రత్త పడినట్లు సమాచారం. వివరాల్లోకి వెళ్లితే... పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మూడు ప్రధాన పార్టీలు హోరాహోరీగా తలపడ్డాయి. ఇందులో ఓ పార్టీ అభ్యర్థి ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేందుకు డబ్బులు పంపిణీ చేసినట్లు తెలిసింది. ఆయా గ్రామాల్లోని సీనియర్లతో పాటు పార్టీ అధ్యక్షులకు బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం. ఎన్నికలకు ఒక రోజు ముందే డబ్బులు ముట్టినట్లు తెలిసింది. కొన్ని గ్రామాల్లో సదరు వ్యక్తులు ఓటర్లకు నామమాత్రంగా డబ్బులు పంపిణీ చేసి... గ్రామాల నుంచి బయటికి వెళ్లినట్లు సమాచారం. కొంతమంది ఓటర్లకు డబ్బులు రాకపోవడంతో కార్యకర్తలు సదరు పార్టీ అధ్యక్షులను నిలదీసినట్లు తెలిసింది.

డబ్బులివ్వకపోవడంతో క్రాస్ ఓటింగ్...

కొన్ని గ్రామాల్లో నామమాత్రంగా డబ్బులు పంపిణీ చేయడం.. మరికొన్ని గ్రామాల్లో కొంతమంది ఓటర్లకు డబ్బులు ఇచ్చి..పక్క ఇంటి వారికి ఇవ్వకపోవడంతో క్రాస్ ఓటింగ్ జరిగినట్లుగా స్థానికులు చెబుతున్నారు. డబ్బులు పంపిణీ చేయని రెండు ప్రధాన పార్టీల అభ్యర్థుల లబ్ధి పొందినట్లుగా చర్చ జరుగుతోంది.

రాకేశ్‌రెడ్డిని కలిసిన బీఆర్‌ఎస్ శ్రేణులు

హసన్‌పర్తి: నల్గొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా రా కేశ్‌రెడ్డి అభ్యర్థిత్వాన్ని ప్రకటించినందుకు పార్టీ శ్రేణులు మంగళవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ తన గెలుపునకు కృషి చేయాలని కోరారు.

సంక్షిప్త సమాచారం

ప్రసన్నాంజనేయస్వామికి విశేష పూజలు

హన్మకొండ అర్బన్ : నగరంలోని పద్మాక్షికాలనీలోని హనుమద్గిరి శ్రీప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో మంగళవారం స్వామివారికి పంచామృత అభిషేకం, చందన సేవ, 51 కిలోల మార్వాడి శనిగలతో అలంకరించినట్లు దేవాలయ అర్చకులు ఆరుట్ల రామాచారి తెలిపారు. అనంతరం భజన నిర్వహించి, ఆంజనేయ స్వాములు, భక్తులకు అన్నదానం చేపట్టినట్లు పేర్కొన్నారు.

మెట్టుగుట్టపై ప్రత్యేక పూజలు

మడికొండ: వైశాఖ మాసం సందర్భంగా మెట్టుగుట్టపై ఉన్న శ్రీ ఆంజనేయస్వామి విగ్రహానికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. తమలపాకులతో ప్రత్యేక అర్చకులు విష్ణువర్ధనచారి మంత్రోచ్చరణల మధ్య వైభవంగా నిర్వహించారు.

పిల్లలకు వీబీఎస్ క్యాంప్ ప్రారంభం

కాజీపేట రూరల్ : బాపూజీనగర్‌లోని గెత్సెమనే ప్రార్థన మందిరంలో మంగళవారం వేసవికాలాన్ని పురస్కరించుకొని చర్చిలో సండే స్కూల్ పిల్లలకు ఒకేషనల్ బైబిల్ స్కూల్ క్యాంప్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డాక్టర్ సిహెచ్.సత్యం పాల్గొని సండే స్కూల్ పిల్లలను ఉద్దేశించి మాట్లాడుతూ సమాజంలో పిల్లలు దేవునియందు ప్రేమ కలిగి ఉన్నత చదువులు అధిరోహించి సేవ చేసి జీవించాలని అన్నారు. ఈ క్యాంప్‌లో సింగింగ్, డ్యాన్సింగ్, గేమ్స్, స్కిల్స్ వంటి తదితర పోటీలను నిర్వహించి బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

హనుమాన్ మాలధారులకు అన్నదానం



కాజీపేట అర్బన్ : 31వ డివిజన్ పరిధి న్యూశాయంపేటలోని శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయ కుటీరంలో మంగళవారం హనుమాన్ మాలధారణ స్వాములకు అన్నదానం నిర్వహించారు. సుమారు 800 మంది స్వాములకు అన్నదానం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.